

పీహెచ్‌సీలో రక్తపరీక్షలు బంద్
పెంచికల్‌పేట్ పీహెచ్‌సీలో టెక్నీషియన్ లేక నెలరోజులుగా రక్తపరీక్షలు నిలిచిపోయాయి. గర్భిణులు, రోగులు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. 9లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:24	గురు : 4:58

గరిష్ఠం/కనిష్ఠం
37.8 /22.6

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉత్తమ పనితీరు చూపాలి



ఎస్పీ డీవీ శ్రీనివాసరావుకు మొక్క అందిస్తున్న మెంగరావు

ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసులు ఉత్తమ పనితీరు చూపాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మెంగారావు ఏఎస్సైగా పదోన్నతి పొందగా, జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్ పాల్గొన్నారు.

ఉత్తమ బోధనకు అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థుల్లో ఇంగ్లిష్ అంటే భయం పోగొట్టి.. వెనుకబడిన విద్యార్థులు సైతం చదవడం, రాయడం, మాట్లాడటంలో ప్రతిభ చూపేలా కృషి చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్ (సీఆర్‌టీ) కె.ప్రవీణ్‌కుమార్‌ను అవార్డు వరించింది. ఉట్నూర్‌లోని పీఎంఆర్‌సీ భారత్ దేఖో సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం యంగ్ ఓరేటర్ క్లబ్(వైఓసీ) అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కెరమెరి మండలం రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్‌టీ ప్రవీణ్‌కుమార్ ఉత్తమ ఇంగ్లిష్ టీచర్‌గా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. గత నెల 20న రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సందర్శించారు. విద్యార్థుల ఇంగ్లిష్ ప్రావీణ్యతను గుర్తించారు. ఈ మేరకు ప్రవీణ్‌కుమార్ కృషిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. ఏపీఎంవోలు పుర్కా ఉద్ధవ్, జగన్ అవార్డు ప్రదానం చేశారు. ఉమ్మడి జిల్లాలో 16 మందిని అవార్డు చేయగా, ఇందులో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వారు నలుగురు ఉన్నారు.

పోటాపోటీగా సంతల వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కౌటాల(సిర్పూర్): కౌటాల వారసంత, పశువుల సంత నిర్వహణ రుసుం వసూలు చేసేందుకు మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో కోట ప్రసాద్ అధ్యక్షతన వేలం నిర్వహించారు. వ్యాపారులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. కౌటాల వార సంతను రూ.7.25 లక్షలకు సదాశివపేట కాలనీకి చెందిన అనంతుల సాయికృష్ణ దక్కించుకున్నారు. పశువుల సంత వేలం దాదాపుగా గంటకు పైగా సాగింది. చివరికి కోయగూడ కాలనీకి చెందిన కుమురం సకారం రూ.28.45 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది నిర్వహించిన వేలంలో వారసంత రూ.4.20 లక్షలు, పశువుల సంత రూ.11 లక్షలు పలికింది. గతేడాదితో పోల్చితే ఈసారి కౌటాల పంచాయతీకి రూ.20.37 లక్షల అదనపు ఆదాయం సమకూరింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ ముత్యం రమేశ్ సమక్షంలో బందోబస్తు నిర్వహించారు. సమావేశంలో ఎస్సై మధుకర్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, మాజీ ఎంపీపీ విశ్వనాథ్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు విజయ్, మాజీ సర్పంచ్ మౌనిశ్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

ఒకే దేశం- ఒకే ఎన్నిక విధానంతో దేశానికి మేలు

దహెగాం(సిర్పూర్): ఒకే దేశం- ఒకే ఎన్నిక విధానంతో దేశానికి మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, వన్ నేషన్- వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ద్వారా ఆర్థికభారం తగ్గుతుందన్నారు. పరిపాలన సామర్థ్యం పెంచడమే ప్రధాన లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. కార్యకర్తలు ఒకే దేశం- ఒకే ఎన్నిక విధానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కొన్ని పార్టీలు ఈ విధానంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వారికి రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని ఆరోపించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ధనుంజయ్, నియోజకవర్గ కన్వీనర్ వీరభద్రచారి, నాయకులు వెంకటేశం, లక్మాజీ, రమేశ్, దామోదర్, చందు, ప్రదీప్, సురేశ్ పాల్గొన్నారు.

ఊరిస్తున్న గోలేటి ఓసీపీ

- ఆలస్యమవుతున్న ఏర్పాటు ప్రక్రియ
- స్టేజ్- 1 అనుమతుల కోసం నిరీక్షణ
- అక్టోబర్ దాటితే మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సిందే..
- ఓపెన్ కాస్టు కోసం కార్మికులు, ప్రజల ఎదురుచూపు



గోలేటి ఓసీపీలో భాగం కానున్న అబ్బాపూర్ ఓసీపీ ప్రాంతం

రెబ్బెన(ఆసిఫాబాద్): ఒకప్పుడు బొగ్గు గనులు, వేలాది మంది కార్మికులతో కళకళలాడిన బెల్లంపల్లి ఏరియా ప్రస్తుతం ఒకేఒక్క ఓసీపీ(ఓపెన్ కాస్టు ప్రాజెక్టు)తో కాలాన్ని వెళ్లదీస్తోంది. ఏరియాకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ప్రస్తుతం ఉన్న ఖైరిగూడ ఓసీపీ జీవితకాలం మరో మూడేళ్లలో పూర్తి కానుండటంతో ఏరియా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది. ఆ లోపే ఏరియాకు పునర్జీవం అందించేలా గోలేటి, ఎంవీకే ఓసీపీలను ఏర్పాటు చేయాలని సింగరేణి యాజమాన్యం ముమ్మర ప్రయత్నాలు సాగిస్తోంది. అయితే అనుమతులు సకాలంలో అందకపోవడంతో గోలేటి ఓసీపీ ఏర్పాటు ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఐదేళ్ల క్రితమే ప్రక్రియ ప్రారంభించినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అనుమతులు రాలేదు. ఏరియా అధికారులు మాత్రం ఓసీపీ ఏర్పాటుపై ఊరిస్తూనే ఉన్నారు.

15 ఏళ్ల జీవిత కాలంతో..

బెల్లంపల్లి ఏరియాలో ప్రస్తుతం ఖైరిగూడ ఓసీపీ ఒక్కటే కొనసాగుతోంది. ఇక్కడ మరో 10 మిలియన్ టన్నుల వరకు మాత్రమే బొగ్గు నిల్వలు ఉండగా.. మరో మూడేళ్లపాటు ఈ ఓసీపీ నడుస్తుంది. ఆ లోపే గోలేటి ఓసీపీని ఏర్పాటు చేయాలని అధికారులు ముందుకు సాగుతున్నారు. సుమారు రూ.220 కోట్ల నిధులు గోలేటి ఓసీపీ కోసం ఖర్చు చేయనున్నారు. ఏరియాలో మూసివేసిన గోలేటి- 1, గోలేటి- 1ఏ భూగర్భ గనులు, బీపీఏ ఓసీపీ- 2 ఎక్స్‌టెన్షన్, అబ్బాపూర్ ఓసీపీ భూభాగాన్ని కలుపుకుని గోలేటి ఓసీపీని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. గోలేటి ఓసీపీ ద్వారా 15 ఏళ్లపాటు నిరాటకంగా బొగ్గు ఉత్పత్తి చేపట్టవచ్చని యాజమాన్యం అంచనా వేయగా.. 36 మిలియన్ టన్నుల వరకు నిక్షేపాలు అందుబాటులో ఉన్నాయి. గోలేటి ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ మొదలు కాగానే.. ఎంవీకే ఓసీపీ ఏర్పాటు ప్రక్రియ మొదలుపెట్టాలని చూస్తున్నారు. ఎంవీకే ఓసీపీ జీవిత కాలం సుమారు 20 ఏళ్లు ఉంటుందని అంచనా. గోలేటి ఓసీపీతోపాటు ఎంవీకే ఓసీపీ అందుబాటులోకి వస్తే బెల్లంపల్లి ఏరియా పూర్వ వైభవం రావడం ఖాయం.

స్టేజ్ 1 అనుమతులపైనే ఆశలన్నీ..



మూసివేసిన గోలేటి- 1 భూగర్భగని

బెల్లంపల్లి ఏరియా భవిష్యత్ ఆశాదీపంగా భావిస్తున్న గోలేటి ఓసీపీకి ఇప్పటివరకు స్టేజ్ -1 అనుమతులు కూడా రాకపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. కొన్నేళ్లుగా స్టేజ్- 1 అనుమతులు కోసం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్టు అధికారులకు దరఖాస్తు చేసుకున్నా కిందిస్థాయి నుంచి కేంద్రం వరకు ఒక్కోస్థాయిలో జాప్యం జరుగుతోంది. ఎట్టకేలకు స్టేజ్- 1 అనుమతులకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ వద్దకు చేరింది. వచ్చే నెలలో ఈ అనుమతులు వచ్చే అవకాశం ఉందని ఏరియా అధికారులు భావిస్తున్నారు. అనుమతులు రాగానే పర్యావరణ అనుమతులతో పాటు స్టేజ్- 2 అనుమతులు సాధించేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. అయితే గోలేటి ఓసీపీ కోసం యాజమాన్యం 2022 అక్టోబర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఒకసారి ప్రజాభిప్రాయ పూర్తయిన తర్వాత మూడేళ్లలోపు ప్రాజెక్టు ప్రారంభించని పక్షంలో మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉంటుంది. దీంతో వచ్చే అక్టోబర్ లోగా స్టేజ్- 1 అనుమతులతోపాటు పర్యావరణ అనుమతులు సైతం సాధించేందుకు అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

వచ్చే ఏడాది నుంచి బొగ్గు ఉత్పత్తి



బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా ప్రారంభించనున్న గోలేటి ఓసీపీ ద్వారా వచ్చే ఏడాది నుంచి బొగ్గు ఉత్పత్తి చేపట్టాలనే చూస్తున్నాం. అనుమతులు కోసం ప్రయత్నిస్తున్నాం. వచ్చే నెలలో స్టేజ్- 1 అనుమతులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్విరాన్‌మెంట్, స్టేజ్- 2 అనుమతుల కోసం ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాం. పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఏడాది నుంచి గోలేటి ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి మొదలువుతుంది. ఆ తర్వాత కొన్నేళ్లకే ఎంవీకే ఓసీపీ సైతం ఏర్పాటు అవుతుంది.

– విజయభాస్కర్‌రెడ్డి, బెల్లంపల్లి ఏరియా జీఎం

1,358.280 హెక్టార్లలో..

కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో గోలేటి ఓసీపీని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు 1,358.280 హెక్టార్ల భూభాగం అవసరం ఉండగా గోలేటి- 1, గోలేటి- 1ఏ, అబ్బాపూర్ ఓసీపీ, బీపీఏ ఓసీపీ- 2 ఎక్స్‌టెన్షన్‌ల కోసం గతంలో సేకరించిన 594.071 హెక్టార్ల భూమి ప్రస్తుతం సింగరేణి అధీనంలో ఉంది. మిగిలిన 665.914 హెక్టార్లు సేకరించాల్సి ఉంది. ఇందులో 59 ఎకరాల మాత్రమే ప్రైవేటు భూమి ఉంది. మిగిలినదంతా అటవీశాఖకు చెందినది కావడంతో భూసేకరణ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ప్రైవేటు భూమి సేకరణ ప్రక్రియ కలెక్టరేట్ పరిధిలో ఉండగా త్వరలో అవార్డు కానుంది. మిగిలిన అటవీశాఖ భూసేకరణకు సంబంధించిన స్టేజ్- 1, స్టేజ్- 2 అనుమతులతోపాటు పర్యావరణ అనుమతులు రాగానే ఓసీపీ ద్వారా బొగ్గు ఉత్పత్తి చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితులు అనుకూలిస్తే 2026లో గోలేటి ఓసీపీ ద్వారా ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

‘పోడు రైతులను ఇబ్బంది పెట్టొద్దు’



రైతులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూర్(సిర్పూర్): అటవీశాఖ అధికారులు పోడు రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం రైతులతో కలిసి జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలోని గ్రామాల్లో తాగునీటి బోర్లు వేసుకునే అవకాశం కల్పించాలన్నారు. హక్కుపత్రాలు ఉన్న రైతులు పత్తి కట్టె తీసేందుకు ఇబ్బందులకు గురిచేయవద్దని పేర్కొన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహించి, రైతులు భూములు సాగు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని డీఎఫ్‌వో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీ దుబ్బుల నాన్నయ్య, మాజీ సర్పంచ్ విశ్వేశ్వర్, నాయకులు పారుపల్లి పోశం, ఉమామహేష్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

34 కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు

ఆసిఫాబాద్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు 34 కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ రాథోడ్ శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. వోల్టేజీలో హెచ్చుతగ్గులు లేకుండా చూడడంతోపాటు సబ్ స్టేషన్ లైన్లలో విద్యుత్‌సరఫరాలో ఓవర్‌లోడ్ కాకుండా ఇవి నియంత్రిస్తాయన్నారు. 11 కేవీ లైన్లలో 600 కేవీఆర్ కెపాసిటర్లు అమర్చడం ద్వారా సరఫరా మెరుగుపడుతుందన్నారు. వ్యవసాయ పంపు సెట్లు, పారిశ్రామిక ఫీడర్లలో లోవోల్టేజీతో మోటార్లు కాలిపోకుండా దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు వేగంగా పూర్తిచేయాలి



పాశిగాంలో ఇంటి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మండలంలోని నవేగాంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పనులు చేపట్టని లబ్ధిదారులతో మాట్లాడాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. నిర్మాణ దశలోని ఇళ్లను పూర్తిచేయడంపై దృష్టి సారించాలన్నారు. వర్షాకాలం ప్రారంభంలోగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మిషన్ భగీరథ నీరందని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పైపులైన్ల లీకేజీ, బోరు బావుల మరమ్మతులు పూర్తిచేయాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పించాలి

అనుమతులు లేని లేఅవుట్లను క్రమబద్ధీకరణకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 31లోగా అర్హులు ఈ పథకం సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో డీపీవో భిక్షపతి, ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో వాసుదేవ్, హౌసింగ్ డీఈ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రుణ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్: జిల్లాలో స్త్రీనిధి రుణ బకాయిల వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్‌డీవో దత్తారావుతో కలిసి సహాయ ప్రాజెక్టు మేనేజర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సాధికారత కల్పించే లక్ష్యంతో అందించిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 28వ తేదీని తుది గడువుగా నిర్ణయించామని పేర్కొన్నారు. రుణగ్రహీతలతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. ప్రత్యేక ప్రణాళిక రూపొందించి గడువులోగా వందశాతం రుణాలు వసూలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, రిసోర్స్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాది ఆవేశం కాదు.. ఆవేదన

- షోకాజ్ నోటీసుకు వివరణ ఇచ్చిన రావి శ్రీనివాస్



వివరణ ఇస్తున్న రావి శ్రీనివాస్

కౌటాల(సిర్పూర్): ‘నాది ఆవేశం కాదని, ఆవేదన’ అని సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఇటీవల రావి శ్రీనివాస్‌కు ఇచ్చిన షోకాజ్ నోటీస్‌కు మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన వివరణ పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇద్దరు, ముగ్గురు నాయకులు మంత్రి సీతక్కకు తప్పుడు సమాచారం ఇస్తూ తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులకు జరుగుతున్న అన్యాయాన్ని తెలిపానని, నాకు వ్యక్తిగతంగా ఎవరిపైనా ఈర్ష్యలేదని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల నుంచి పెరుగుతున్న ఫిర్యాదుల మేరకు ఎమ్మెల్సీ దండె విఠల్‌కు వివరణ తెలపాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీ ఇంటికి వెళ్లానని, నాకు వేరే ఉద్దేశం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా కొత్త, పాత నాయకుల మధ్య సమన్వయం కోసం కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ విధి విధానాలకు కట్టుబడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఏఐ పాఠం.. ఆసక్తికరం



తప్పు చేస్తే చెబుతోంది ↑

ఏఐ బోధన ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. 20 నిమిషాలు ఇట్టే గడిచిపోతున్నాయి. తప్పులు చేస్తే.. కంప్యూటర్ చెబుతోంది. చేసిన తప్పు రెండోసారి చేస్తలేను. తెలుగులో వాక్యాలు రాయగలుగుతున్నా.

– డి.రిషిత, ఐదో తరగతి, గోయగాం ప్రాథమిక పాఠశాల



ఏఐ ద్వారా గణితం నేర్చుకుంటున్న ఖిరిడి పాఠశాల విద్యార్థులు

సరిపడా కంప్యూటర్లు లేవు



గణిత బోధన పద్ధతులు సులభంగా అర్థం చేసుకునేలా ఉంటున్నాయి. కానీ పాఠాలు ఇంగ్లిష్‌లో బోధిస్తున్నాయి. సక్రమంగా అర్థం కావడం లేదు. తెలుగులో బోధిస్తే ఇంకా మేలు. త్వరగా అర్థం చేసుకోవచ్చు. కంప్యూటర్లు సరిపడా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– అదె సంధ్య, ఐదో తరగతి, ఖిరిడి ప్రాథమిక పాఠశాల

కొత్తగా అనిపిస్తుంది



కంప్యూటర్లతో నేర్చుకోవడం కొత్తగా అనిపిస్తుంది. అర్థమయ్యే రీతిలో ప్రశ్నలు ఉన్నాయి. త్వరగా అర్థం చేసుకుంటున్నాను. ప్రశ్నలకు జవాబు తప్పుగా రాస్తే మరో అవకాశం ఉంది. సులువుగా లెక్కలు ఎలా చేయాలనేది వివరిస్తోంది.

– అదె హర్షిత, ఐదో తరగతి, ఖిరిడి ప్రాథమిక పాఠశాల

- ఒక్కో విద్యార్థికి 20 నిమిషాలపాటు తరగతులు
- అభ్యసన సామర్థ్యాల పెంపుదలకు దోహదం
- జిల్లాలోని నాలుగు ప్రాథమిక పాఠశాలల్లో కృత్రిమ మేధాతో బోధన

కెరమెరి(ఆసిఫాబాద్): నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) బోధనను ప్రారంభించింది. జిల్లాలో మొదటి విడతలో నాలుగు పాఠశాలల్లో తరగతులు మొదలయ్యాయి. ప్రతిరోజూ 20 నిమిషాలపాటు తెలుగు, గణితం బోధన కొనసాగుతుంది. గతంలో పోల్చుకుంటే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్లో మార్పు వచ్చిందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఏఐ పాఠాలపై ఎంతో ఆసక్తితో వింటున్నారని చెబుతున్నారు. సీ గ్రేడ్ విద్యార్థులు ఆసక్తిగా చదువు కొనసాగించేందుకు ఎఫ్‌ఎల్‌ఎన్(ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ)అమలులో ఇది కీలకంగా మారింది. గతంలో గణితం ఇబ్బందిగా పడే వారు మెరుగయ్యారు. కూడికలు, తీసివేతలు చేయగలుగుతున్నారు. చిన్నచిన్న గుణకారాలు చేస్తున్నారు. గతంలో ఉపాధ్యాయులు బోర్డుపై చెప్పగా, ప్రస్తుతం రంగురంగుల బొమ్మలతో గణితం బోధన కొనసాగుతోంది. తెలుగులో సరళ, కఠిన పదాలు రాని వారు ప్రస్తుతం రాయడం, చదవడం చేస్తున్నారు. ప్రాథమిక స్థాయిలోని విద్యార్థులకు కీబోర్డు, మౌస్ అంటేనే తెలియదు. అలాంటి వారికి కంప్యూటర్, కీబోర్డు, మౌస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. మూల్యాంకనం అనంతరం విద్యార్థి స్థాయిని నిర్ధారించి బోధన మెరుగుపరుస్తున్నారు. మొత్తం పది దశల్లో ఇప్పటికే విద్యార్థులు మూడు దశలకు చేరారు.

ప్రతీ పాఠశాలలో పది మంది..

చదువులో వెనుకబడిన విద్యార్థులకు కృత్రిమ మేధా ద్వారా సులభ రీతిలో పాఠాలు బోధించేలా విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ తరగతులను ప్రవేశపెట్టింది. రెబ్బెన మండలంలోని తక్కెళ్లపల్లి ప్రాథమిక పాఠశాల, కెరమెరి మండలం గోయగాం, వాంకిడి మండలం ఖిరిడి, బెజ్జూర్ మండలం సలుగుపల్లి ప్రైమరీ పాఠశాలలను ఎంపిక చేశారు. 3, 4, 5వ తరగతుల నుంచి పది మంది విద్యార్థులకు ఏఐ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతీ విద్యార్థికి ప్రత్యేక యూజర్ ఐడీ ఉంటుంది. లాగిన్ అయిన తర్వాత 20 నిమిషాల పాటు ప్రశ్నలు, పాఠాలు ఉంటాయి. కృత్రిమ మేధా ద్వారా నిర్వహిస్తున్న తరగతులు సులభ రీతిలో పిల్లలు త్వరగా అర్థం చేసుకునేలా ఉన్నాయి. ముందుగా ప్రశ్నల సరళితో విద్యార్థుల సామార్థ్యాలను పరిశీలిస్తుంది. ఆ తర్వాత దానికి అనుగుణంగా పాఠాలు బోధిస్తుంది. ఖిరిడి ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్లు లేకపోవడంతో పక్కనే ఉన్న ఉన్నత పాఠశాలలోని కంప్యూటర్లను వాడుతున్నారు. అక్కడ ఐదింటిలో మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. మూడు కంప్యూటర్లు, ఒక స్కూల్ ట్యాబ్ ద్వారా 20 నిమిషాలకు నలుగురి చొప్పున తరగతులు నిర్వహిస్తున్నారు. చాలాచోట్ల ప్రశ్నల సరళిని అర్థం చేసుకుంటున్నా పాఠాల బోధన ఆంగ్లంలో ఉండటంతో చిన్నారులు తికమక పడుతున్నారు.

కంప్యూటర్ వినియోగంపై అవగాహన



ఏఐ తరగతులకు చదువులో వెనుకబడిన పది మంది విద్యార్థులను ఎంపిక చేశాం. సోమ, మంగళ, బుధ, గురు వారాల్లో ప్రతీ విద్యార్థికి 20 నిమిషాల చొప్పున తరగతులు ఉంటాయి. కంప్యూటర్ల ద్వారా తరగతులు, ప్రశ్నలు ఉండటంతో విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. కంప్యూటర్ వినియోగంపై కూడా వారికి అవగాహన వస్తుంది.

– శివరాజ్, ఉపాధ్యాయుడు, ఖిరిడి ప్రాథమిక పాఠశాల

విద్యార్థులకు ఉపయోగం



విద్యార్థులు ఏఐ బోధనతో పాఠాలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. 20 నిమిషాలు ఉత్సాహంగా చతుర్విధ ప్రక్రియలు చేయగలుగుతున్నారు. తెలుగు వాక్యాలు రాయగలుగుతున్నారు. ప్రస్తుతం మూడో దశకు చేరారు. కృత్రిమ మేధా విద్యార్థులకు ఎంతో ఉపయోగం.

– భరత్‌రావు, ఉపాధ్యాయుడు, గోయగాం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద(నిర్మల్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన గుడిమల్ల రాజు లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్‌లో విద్యుత్ శాఖలో జేఎల్‌ఎం గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం వడ్యాల్‌లో సిబ్బందితో కలిసి విద్యుత్ బిల్లులు వసులు చేశారు. మధ్యాహ్నం బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కనకాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై ఖానాపూర్ వైపు నుండి వేగంగా వస్తున్న కారు రాజు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ముందుగా నిర్మల్ ఏరియా ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ప్రొబేషనరీ ఎస్సై జుబేర్, ఏఎస్సై నారాయణరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

టిప్పర్, బైక్ ఢీకొని ఇద్దరికి ...



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

దస్తురాబాద్: బుట్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నూర్ గ్రామ సమీపంలో మంగళవారం టిప్పర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై సీ.అశోక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని చెన్నూర్‌కు చెందిన శంకర్‌గౌడ్, కలమడుగుకు చెందిన రాకేశ్ ద్విచక్ర వాహనంపై కలమడుగు నుంచి చెన్నూర్‌కు వస్తుండగా పాండ్వాపూర్-కలమడుగు రహదారిపై టిప్పర్ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను జగిత్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శంకర్ గౌడ్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

సిరికొండ: ఎడ్లబండ్లపై అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు ఫారెస్టు డివిజన్ అధికారి రేవంత్‌చంద్ర తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి గోపాల్‌పూర్ గ్రామ శివారులో మారుతిగూడకు చెందిన వ్యక్తులు రెండు ఎడ్లబండ్లపై కలపను తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితులు పారిపోయారని, కలపను, ఎడ్లబండ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కలప విలువ రూ.1.50 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడిలో సిరిచెల్మ ఎఫ్ఆర్వో నాగవత్ స్వామి, ఇంద్రవెల్లి ఎఫ్ఆర్వో సంతోష్, సిరికొండ డీఆర్వో నరేష్, తదితరులు ఉన్నారు.

కానుకలు వద్దు.. నగదే ఇద్దాం!

- మంగళ్‌మోట్ మహిళ వినూత్న ఆలోచన
- ఆడపిల్ల పెళ్లికి వస్తువులకు బదులు నగదే ఇవ్వాలని నిర్ణయం..
- ఆదివాసీ మహిళ ఐడియా.. జిల్లా అంతా ఆచరణ
- పెళ్లి కూతుళ్లకు నగదు ఇస్తూ అండగా నిలుస్తున్న గూడేలు



పెళ్లికూతురుకు నగదు అందజేస్తున్న మహిళలు (ఫైల్)



మెస్రం శ్రీదేవి

ఇచ్చోడ(బోథ్): ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం తర్నం(బి) పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామమైన మంగళ్‌మోట్ ఆదివాసీ మహిళలు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఆడపిల్లల వివాహం కుటుంబ పెద్దకు భారం కాకూడదని భావించి వివాహ సమయంలో కట్నకానుకల కింద ఇచ్చే ఇత్తడి, వెండి, స్టీల్ సామగ్రికి బదులు నగదు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించారు. ఆదివాసీ మహిళలు తీసుకున్న ఈ నిర్ణయం ప్రసుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంప్రదాయబద్ధంగా మారింది. ఆదివాసీ గూడేల్లో ఎక్కడ పెళ్లి జరిగినా కట్నకానుకలు తీసుకోవడం లేదు. వాటికి బదులుగా తోచినంత నగదు అందించి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

వయసు చిన్నది..ఆలోచన పెద్దది

మంగళ్‌మోట్ గ్రామానికి చెందిన మెస్రం శ్రీదేవి ఐదోతరగతి నుంచి పదోతరగతి వరకు నేరడిగొండ మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలలో చదివి ఉత్తమ మార్కులు సాధించింది. ఐటీడీఏ తరఫున హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. జీఎస్‌ఎం ట్రెనింగ్ పూర్తి చేసి కొంతకాలం ప్రైవేట్ ఉద్యోగం చేసింది. 2018లో అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెళ్లిళ్లలో కట్నం కింద సామగ్రి ఇస్తుండడంతో డబ్బులు వృథా అవుతున్నాయని శ్రీదేవితో పాటు పలువురు మహిళలు గుర్తించారు. ఈ మేరకు కట్నకానుకలు నిషేధించి వాటికి బదులుగా నగదు ఇవ్వడంతో పెళ్లి కూతురు ఇంటి పెద్దకు కొంత ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు అవుతుందని భావించి గ్రామస్తులకు విషయాన్ని తెలియజేసింది. గ్రామపెద్దలు సైతం ఆమెతో ఏకీభవించారు. ఇక నుంచి కట్నం కింద వస్తువులు ఇవ్వడం నిషేధమని తీర్మానించి అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది మార్చి 3న మంగళ్‌మోట్‌లో జరిగిన వసంత వివాహానికి ఊరి ఆడపడుచులంతా కలిసి రూ.20 వేల నగదును అందజేశారు. మారుమూల గ్రామంలో తీసుకున్న ఈ నిర్ణయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గూడేల ప్రజలను ఆలోచింపజేసింది.

ఇటీవల పలుచోట్ల ఇలా..

- ఈనెల 14న సిరికొండ మండలంలోని కోసుపటేల్‌గూడకు చెందిన యువతి వివాహం జరిగింది. గ్రామస్తులంతా కలిసి రూ.20 వేల నగదు అందజేశారు.
- ఈ నెల 20న ఇంద్రవెల్లి మండలం సమాకలో తొడసం గౌరుబాయి వివాహం కొట్నాక్ దేవ్‌రావుతో జరిగింది. గ్రామస్తులు ప్రతీ ఇంటి నుంచి రూ.200 జమచేసి రూ.24,900 నగదును కట్నకానుకలకు బదులుగా అందజేసినట్లు గ్రామ పటేల్ పెందూర్ భగవంత్‌రావు తెలిపారు.
- ఈ నెల 20న బజార్‌హత్నూర్ మండలంలోని అనంత్‌పూర్ గ్రామానికి చెందిన సేవంతకు ఇచ్చోడ మండలంలోని బొజ్జుగూడకు చెందిన నగేష్‌తో వివాహం జరిగింది. గ్రామస్తులంతా కలిసి రూ.22 వేల నగదు అందించి అండగా నిలిచారు.

గర్వంగా ఉంది



మా గూడెంలో తీసుకున్న నిర్ణయం పలు గూడేల్లో అమలు చేయడం గర్వంగా ఉంది. కాలానికి అనుగుణంగా నడుచుకోవాలి. 50 ఏళ్ల క్రితం కట్నకానుకలు లేకుండానే పెళ్లిళ్లు జరిగేవి. వరుడు వధువు ఇంటివద్ద, వధువు వరుడి ఇంటివద్ద నెలరోజులు పనులు చేసేవారు. వారి పని నచ్చితే పెద్దలు వారిద్దరికి వివాహం జరిపించేవారు.– కుంర భీంరావు, భూమవ్వ, మంగళ్‌మోట్, గ్రామపటేల్ దంపతులు

అరుదైన పక్షి



దహెగాం మండల కేంద్రంలో మంగళవారం అరుదైన పక్షి కనిపించింది. ఎండవేడికి తట్టుకోలేక దుకాణ సముదాయాల్లోకి వచ్చింది. స్థానికులు పట్టుకుని నీటిని తాగించారు. ఎఫ్ఎస్‌వో సద్దాం దృష్టికి తీసుకెళ్లగా దీని పేరు గోల్డెన్ ఓరియల్ అని పేర్కొన్నారు. ఇది అటవీ ప్రాంతాల్లో కనిపిస్తుందన్నారు. – దహెగాం

విద్యార్థుల జంగల్ సఫారీ



హాజీపూర్ మండలం గఢ్‌పూర్ మండల పరిధిలోని ఎంసీసీ క్వారీలో గల జంగల్ సఫారీలో మంగళవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలకు చెందిన బీజెడ్‌సీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ట్రెక్కింగ్ చేశారు. అటవీ ప్రాంతంలో పర్యటిస్తూ వివిధ రకాల చెట్లతో పాటు మెడికేటెడ్ చెట్లు, వివిధ రకాల పక్షులు, జంతువుల గురించి తెలుసుకున్నారు. గడ్డి వనాలు, ఎత్తయిన కొండలు, అటవీ అందాలను తిలకించారు. ఎఫ్‌బీవోలు రాజేందర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)

ఏటీఎం కార్డు మార్చి.. రూ.40వేలు నొక్కేసి..!



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు ఆదర్శ్

భైంసాటౌన్(ముధోల్): ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేసేందుకు వచ్చిన ఓ యువకుడిని ఏమార్చి అతని కార్డును తన వద్ద ఉన్న కార్డుతో మార్చి నగదు తస్కరించిన ఘటన భైంసా పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని దేగాంకు చెందిన ఆదర్శ్ బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసేందుకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఏటీఎంకు వచ్చాడు. డబ్బులు విత్‌డ్రా చేస్తున్న క్రమంలో చింతల్‌బోరికి చెందిన జాదవ్ బాలాజీ డబ్బులు డ్రా చేసిస్తానని చెప్పి అతని కార్డు తీసుకున్నాడు. కొద్దిసేపటికి డబ్బులు రావడం లేదని, బ్యాంకులో అడగాలంటూ తన వద్ద కార్డు మార్చి ఇచ్చాడు. గమనించని ఆదర్శ్ పని నిమిత్తం గ్రామానికి వెళ్లగా రూ.పదివేల చొప్పున రూ.40వేలు డ్రా చేసినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వెంటనే భైంసాకు చేరుకుని ఏటీఎం పరిసరాల్లో గాలించగా సదరు వ్యక్తి కనిపించాడు. నిలదీయగా పారిపోయేందుకు యత్నించాడు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి అప్పగించారు. పోలీసులు అతని వద్ద తనిఖీ చేయగా ఆదర్శ్ ఏటీఎం కార్డు, జేబులో నగదు లభించింది.

జవహర్ నవోదయకు 63 మంది ఎంపిక

కుంటాల(ముధోల్): జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–2026 విద్యాసంవత్సరానికిగానూ ఆరోతరగతిలో ప్రవేశానికి జనవరి 18న నిర్వహించిన పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి సుమారు 5 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కుంటాలలోని సృజన విద్యాలయంలో 34, విజయసాయి పాఠశాలలో ఇద్దరు, శాంతినికేతన్ పాఠశాలలో 15, కల్లూర్‌లోని శ్రీసాయి మోడల్ స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ప్రవేశానికి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాళ్లు కొత్తకాపు గంగన్న, సంతోష్, శ్రీకాంత్, బోగ ప్రవీణ్, స్వప్న తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ఆరుగురికి స్వల్పగాయాలు



108లో క్షతగాత్రులు

సారంగపూర్(నిర్మల్): అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లోని శంకర్‌నాయక్ తండావాసులు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా సారంగాపూర్-అడెల్లి గ్రామాల మధ్య కుక్క అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో అందులో ప్రయాణిస్తున్న రాథోడ్ మారుణిబాయి, నీలాబాయి, సవిత, శశికళ, అన్నపూర్ణ, రతన్‌సింగ్‌కు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందివ్వడంతో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి తరలిస్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన భగత్‌కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణంలోని తాటిగూడకు చెందిన కలీమొద్దీన్ అలియాస్ కల్లు ఇంటి వద్ద నుంచి మంగళవారం మధ్యాహ్నం గంజాయి తీసుకొని వెళ్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా కలీమొద్దీన్‌పై ఇదివరకే పలు కేసులతో పాటు సస్పెక్ట్ షీట్ ఉందన్నారు. ఇదివరకే ఆయనను బైండోవర్ సైతం చేయడం జరిగిందన్నారు. భగత్‌కృష్ణను అరెస్టు చేసి బైండోవర్ చేయగా, కలీమొద్దీన్ పరారీలో ఉన్నట్లు వివరించారు.

స్తంభం పైనుంచి పడి లైన్‌మెన్‌కు గాయాలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా కిందపడడంతో లైన్‌మెన్‌కు గాయాలైనట్లు విద్యుత్‌శాఖ ఏడీ ప్రభాకర్ తెలిపారు. లైన్‌మెన్ రాజు మరమ్మతు పనులు చేస్తుండగా పైన ఉన్న 33 కేవీలైన్ వైరు కింద ఉన్న లైన్‌వైరుకు తాకడంతో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఏడీ పేర్కొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు

రామకృష్ణాపూర్: పట్టణంలో నివసించే ఓ బాలిక(10)తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బాలిక నోరు మూసి ఇంట్లోకి రమ్మని అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పులికుంట గ్రామ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై డీ.చంద్రశేఖర్ తెలిపారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, ఒంటిపై నలుపురంగు నైట్‌ప్యాంటు, నల్లని చారల చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చన్నారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య



విష్ణువర్ధన్ (ఫైల్)

దండేపల్లి: గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసినొద్దీన్ తెలిపిన వివరాల మేరకు లక్సెట్టిపేట పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి భూమి విష్ణువర్ధన్ (22) రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. సోమవారం సాయంత్రం బైక్ తీసుకుని ఇంటినుండి బయటికి వెళ్లాడు. రాత్రి సమయంలో బైక్ గూడెం గోదావరి వంతెనపై నిలిపి ఉంచినట్లు తెలుసుకున్న కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మంగళవారం ఉదయం గోదావరి వద్దకు వెళ్లి చూడగా మృతదేహం తేలి ఉంది. మృతుడు ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. మృతుని సోదరుడు మణిదీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

గొడిసిర్యాలలో పురుగుల మందు తాగి మరొకరు ...



నేరెళ్ల అశోక్

దస్తురాబాద్: పురుగుల మందు తాగి యువకుడు బలవన్మరణం చెందిన సంఘటన మంగళవారం మండలంలోని గొడిసిర్యాలలో చోటు చేసుకుంది. ఎస్సై సీ.అశోక్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన నేరెళ్ల అశోక్ (23) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం అతని చిన్నాన్న కుమారుడు పానుగంటి పవన్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి డిప్రెషన్‌కు లోనయ్యాడు. గొడిసిర్యాల ఎక్స్‌రోడ్డు సమీపంలోని అటవీ ప్రాంతంలో అతని తమ్ముడు పవన్ ఆత్మహత్య చేసుకున్న స్థలంలోనే అశోక్ పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు జన్నారంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బాసర గోదావరిలో దూకి మహిళ ...

బాసర(నిర్మల్): బాసర గోదావరిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మండలంలోని ఆష్ట గ్రామానికి చెందిన అనురాధ (35)కు అదే గ్రామానికి చెందిన సాయిలుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాయిలు నిత్యం మద్యం సేవించి ఇంటికివచ్చి వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైంది. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లింది. మంగళవారం తల్లి రాజవ్వకు ఫోన్‌చేసి విషయం తెలిపింది. అనంతరం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా మరణాయుధాలతో సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన వ్యక్తిపై సుమోటో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారిగూడకు చెందిన సలీం ఖాన్ సోషల్ మీడియాలో తల్వార్‌తో ఒక పోస్టును పెట్టడం జరిగిందన్నారు. సుమోటో కేసుగా నమోదు చేసి మంగళవారం సలీం ఖాన్‌పై ఆమ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. ఇదివరకే సలీం ఖాన్ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమెరికాలో మెరిసిన యశిక



మాధవరపు యశిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రానికి చెందిన మాధవరపు యశిక ప్రతిష్ఠాత్మకమైన యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామినేషన్(యూఎస్‌ఎంఎల్‌ఈ)లో అరుదైన ఘనత సాధించింది. రెండు విడతలుగా జరిగిన పరీక్షల్లో ఫ్యామిలీ మెడిసిన్‌లో సీటు సంపాదించింది. మూడేళ్ల తర్వాత వచ్చే పీజీ పట్టాతో ప్రపంచంలోని ఏ దేశంలోనైనా వైద్యసేవలు అందించేలా అవకాశాన్ని అందిపుచ్చుకుంది. యశిక 1 నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లో పూర్తి చేసింది. బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలతో అనుసంధానమైన అమెరికా న్యూయార్క్‌లోని జేవియర్ వైద్య కళాశాలలోని ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్) కోర్సును పూర్తి చేసి అమెరికాలోని చికాగోలో 18 నెలల స్టెప్–1, స్టెప్–2 క్లినికల్స్ కూడా పూర్తి చేసింది. తల్లిదండ్రులు శిల్ప, రాజేశ్వర్‌రావు రాజకీయాల్లో రాణిస్తున్నారు. యశికను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు హాజీపూర్ మండల వాసులు ప్రత్యేకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

గంజాయి నియంత్రణపై స్పెషల్ ఫోకస్

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం: గంజాయి నియంత్రణపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, అరెస్టులు, కేసుల దర్యాప్తులు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్‌కు సంబంధించి ప్రస్తుత పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ, మిస్సింగ్, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, గేమింగ్ యాక్ట్, తదితర కేసులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలీస్ అధికారి చట్టపరిధిలో పనిచేయాలన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పారదర్శకంగా, న్యాయపరంగా విచారణ జరపాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లను నియమించి సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో విలేజ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి విక్రయం, సేవించేవారిపై కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. సమావేశంలో డీసీపీలు ఎగ్గడి భాస్కర్, కరుణాకర్, అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు రమేశ్, కృష్ణ, నరసింహులు, మల్లారెడ్డి, ఏఆర్‌ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై ప్రావీణ్యం పెంచుకోవాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఆంగ్లభాషపై విద్యార్థులు ప్రావీణ్యం పెంచుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం ఉట్నూర్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు బోస్ సంస్థ అందిస్తున్న సేవలతో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. వేసవి సెలవుల్లోను విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఏసీఎం జగన్ మాట్లాడుతూ విద్యార్థి తలరాతను మార్చేది ఉపాధ్యాయులే అన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక, ఆంగ్ల నాటికలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన వారికి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఏసీఎంవోలు ఉదవ్, రాథోడ్ శివాజీ, క్రీడల అధికారి పార్థసారథి, దేవ్‌రావు, బోస్ సంస్థ నిర్వాహకులు రోమిల, నిక్షిత, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలపై త్రిసభ్య కమిటీ విచారణ



సుంకిడిలో విచారణ జరుపుతున్న సభ్యులు

తలమడుగు: మండలంలోని సుంకిడి, ఝరి గ్రామాల్లో ఇటీవల అప్పుల బాధతో ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా రైతు ఆత్మహత్యల నివారణ కోసం ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం గ్రామాల్లో విచారణ చేపట్టారు. కమిటీ సభ్యులైన ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి ఏడీ రాంకిషన్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎస్సై అంజమ్మ, వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి ఝరి గ్రామానికి చెందిన రైతు గడం పోతారెడ్డి కుటుంబ సభ్యులను విచారించారు. రైతుకు ఎన్ని ఎకరాల పొలం ఉంది? కౌలుకు ఎన్ని ఎకరాలు తీసుకున్నాడు? పెట్టుబడి సాయం ఏబ్యాంకులో తీసుకున్నాడు? ప్రైవేట్ అప్పులు ఎంత తీసుకున్నారు? అని వివరాలు సేకరించారు. అనంతరం సుంకిడి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగన్న ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. రైతు వ్యవసాయ వివరాలు, పట్టా పాసు బుక్‌లను, బ్యాంక్ ఖాతాలు, అప్పులు, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుంకిడి మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.